

సాక్షి
పల్నాడు
మంగళవారం । 27 । ఆగస్టు । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 589.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,104 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ 45.51 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 32708 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 33268 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 7508 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 330 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థాన క్షేత్ర పాలకుడైన వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ ఆధ్వర్యంలో అర్చకస్వామి కేశవాచార్యులు స్వామివారికి వేకువజామున పంచసూక్తాలతో పంచామృత స్నపన నిర్వహించి పలు రకాల పుష్పాలతో స్వామివారికి అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి సహస్రనామ పూజ నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకగా నిర్వహించారు.

ముగిసిన అమరేశ్వరుడి పవిత్రోత్సవాలు



అమరావతి: అమరావతిలోని అమరేశ్వరాలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్ణాహుతితో నిర్వహించారు. మండప పూజలు, మండప దేవతాహోమాలు, ప్రాయశ్చిత్త హోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనం, ఆశీర్వచనం నిర్వహించారు. దాతలు యార్లగడ్డ ఉపేంద్ర, విజయలక్ష్మి సహకారంతో నిర్వహిస్తున్న ఈ పవిత్రోత్సవాలతో మూడో రోజున ఉపాలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం మండప దేవతా హోమాలు నిర్వహించారు. ప్రాయశ్చిత్త హోమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించిన పవిత్రోత్సవాలను ముగించారు. అనంతరం కలశానికి ఉద్వాసన చేసి కలశాలలోని పుణ్యజలాలతో స్వామి వారికి అవభృత అభిషేకం నిర్వహించారు. మూడు రోజులపాటు స్వామివారికి ధరింప చేసిన పవిత్రాలను తొలగించి స్వామివారికి విశేషాలంకారం చేసి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా

ప్రయాణికులంతా సురక్షితం



విజయపురిసౌత్ : హైదరాబాద్ నుంచి మాచర్ల వస్తున్న ఆర్టీసీ బస్సు నాగార్జునసాగర్–మాచర్ల ప్రధాన రహదారి ఏకోనాంపేట వద్ద సోమవారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. మాచర్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న 11 మంది ప్రయాణికులతోపాటు డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఉదయం 4 గంటలకు ప్రమాదం జరగగా సమాచారం అందుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. త్రుటిలో ప్రమాదం నుంచి ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో ఊపిరిపీల్చుకున్నారు.

పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో నిర్వహణ

జే.పంగులూరు: పంగులూరులో సెప్టెంబర్ 20,21,22 తేదీల్లో అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య సోమవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గరటయ్య మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఇప్పటికి 10 సార్లు రాష్ట్ర ఖోఖో పోటీలు, 3 సార్లు జాతీయస్థాయి ఖోఖో పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ దఫా పోటీలను సైతం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీళ వెంకటసుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి, ట్రెజరర్ హనుమంతురావు, రొటేరీయన్లు వీరరాఘవయ్య, సింగర్, సాంబశివరావు, హనుమంత రావు, సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజల మద్దతు అవసరం

కోల్‌కతా సంఘటన దురదృష్టకరం. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు దేశవ్యాప్తంగా డాక్టర్లు ప్రయత్నిస్తున్నారు. దీనికి ప్రజల సహకారం కూడా అవసరం. డాక్టర్లు భయం లేకుండా ఎప్పుడైతే వైద్యం అందజేస్తారో రోగులకు తగిన న్యాయం జరుగుతుంది. దీనిని గమనించి ప్రజలు, ప్రభుత్వం సహకరించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ పాలూరి శ్రీనివాసరెడ్డి,
ఐఎంఏ కార్యదర్శి, నరసరావుపేట





విలువ పెంచేలా చర్యలు తీసుకోవాలి

పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలతో సమాజంలో డాక్టర్లకు విలువ లేకుండా పోతుంది. కనీసం వారికి రక్షణ ఉండట్లేదనే దానికి నిదర్శనమే కోల్‌కతా సంఘటన. విలువ తగ్గిపోతుండటంతోనే పేరున్న డాక్టర్లు అమెరికా వెళుతున్నారు. సొసైటీలో డాక్టర్లు, ఉపాధ్యాయులకు విలువ ఉండాల్సిన అవసరం ఉంది. భయం లేకుండా విధులు నిర్వర్తించేందుకు తగిన చట్టాలు తీసుకొచ్చి కఠినంగా అమలుచేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ నరసరావుపేట

ప్రచార ఆర్భాటం.. చిత్తశుద్ధి శూన్యం

- గత టీడీపీ హయాంలో అరకొరగా 'గోకులం' అమలు
- కొర్రీలు వేసి బిల్లులు ఇవ్వని వైనం
- తాజాగా మళ్లీ అమలుకు చర్యలు
- మండలానికి 25 చొప్పున జిల్లాకు 700 కేటాయింపు
- ఆవులు, గేదెల షెడ్లకు 90శాతం రాయితీ
- దరఖాస్తులకు మొగ్గు చూపని పాడి రైతులు

సత్తెనపల్లి: పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తామని చెబుతూ గోకులం పేరిట పశువుల షెడ్ల నిర్మాణ పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా యూనిట్లు కేటాయించకపోవడంతో ఈ పథకం క్షేత్రస్థాయిలో ఆదరణకు నోచుకోవడం లేదు. 2018–19 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని అరకొరగా అమలు చేసింది. మళ్లీ దానిని ఇప్పుడు అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రచార ఆర్భాటం తప్ప చిత్తశుద్ధి కనబరచకపోవడంతో పాడి రైతులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే ఎలాగైనా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పంపాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి అధికమవడంతో అధికారులకు ఈ పథకం తలనొప్పిగా మారింది.

ఈ పథకం ద్వారా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి షెడ్ల నిర్మాణానికి రాయితీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పశుసంవర్ధక శాఖ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండగా, ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేస్తారు. ఆవులు, గేదెలు షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ అందించనున్నట్లు ప్రకటించారు.



2018లో గుడిపూడిలో ఏర్పాటు చేసిన పశువుల షెడ్డు

అరకొరగా కేటాయింపులు

జిల్లాకు 700 యూనిట్లు మంజూరు కాగా, వీటిలో మండలానికి 25 యూనిట్లు చొప్పున మాత్రమే కేటాయించారు. పంచాయతీకి ఒక యూనిట్ కూడా రాని పరిస్థితి నెలకొంది. కూటమి నేతలు పథకం ప్రకారం మండలానికి 25 మందిని గుర్తించి వారి పేర్లు అధికారులకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.

పశువుల షెడ్ల రాయితీ వివరాలు...

పశువుల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
2	రూ.1,15,000	రూ.1,03,500	రూ.11,500
4	రూ.1,85,000	రూ.1,66,500	రూ.18,500
6	రూ.2,30,000	రూ.2,07,000	రూ.23,000

గొర్రెలు మేకలు షెడ్ల రాయితీ వివరాలు...

జీవాల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
20	రూ.1,30,000	రూ.91,000	రూ.39,000
50	రూ.2,30,000	రూ.1,61,000	రూ.69,000

కోళ్ల షెడ్ల రాయితీ వివరాలు

కోళ్ల సంఖ్య	యూనిట్ విలువ	ఉపాధి నిధులు	రైతు వాటా
100	రూ.87,000	రూ.60,900	రూ.26,100
200	రూ.1,32,000	రూ.92,400	రూ.39,600


సమాచారం ఇవ్వని అధికారులు

ఈనెల ప్రారంభం నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ పశు సంవర్ధక శాఖ అధికారులు మాత్రం ఎక్కడా ఈ పథకంపై పాడి రైతులకు సమాచారం ఇవ్వలేదు సరి కదా ఇటీవల వరకు దరఖాస్తులు స్వీకరించలేదు. అయితే తాజాగా రైతు సేవ కేంద్రాలు, పశు వైద్య కేంద్రాల్లో తప్పనిసరిగా దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేయాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో కూటమి నేతల సిఫార్సుల మేరకు మండలానికి 25 చొప్పున దరఖాస్తులు స్వీకరించి పంపినట్లు సమాచారం.

కొర్రీలతో మంజూరు కానీ బిల్లులు

2018–19 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన గోకులం షెడ్లకు తాము చెప్పిన ప్రకారం నిర్మించలేదన్న సాకుతో బిల్లులు చెల్లించలేదు. తాజాగా మంజూరు చేసిన గోకులం షెడ్లపై రైతులు ఆసక్తి చూపించకపోవడానికి ఇది ఒక కారణంగా తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వితంతువులకు, ఇతర సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత క్రమంలో మంజూరు చేస్తారు. దరఖాస్తు చేసుకునే రైతుకు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డ్, జాబ్ కార్డ్, భూమి హక్కు పత్రం, బ్యాంకు ఖాతా పుస్తకం తప్పనిసరిగా ఉండాలి.

టెయిల్‌పాండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 1.0541 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ప్రాజెక్టు ఏడీఈ ఎస్.జయశంకర్, ఏఈ జయపాల్ సోమవారం తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మొత్తం 18.9396 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. డ్యామ్ మూడు క్రస్ట్‌గేట్లు, రెండు యూనిట్లు ద్వారా మొత్తం 29,755 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను 1.50 మీటర్లు పైకి ఎత్తి 21,258 క్యూసెక్కులు, ప్రాజెక్టులోని రెండు యూనిట్లు ద్వారా 1.0541 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అనంతరం 8,497 క్యూసెక్కులు మొత్తం 29,755 క్యూసెక్కులు దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ నీటిమట్టం ప్రాజెక్టు 75.50 మీటర్లకుగాను 75.46 మీటర్లకు నీరు చేరుకుందని రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలకుగాను 7.052 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.53 మీటర్లకు చేరుకుందన్నారు. ఎగువ నున్న నాగార్జునసాగర్ నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.



చిలకలూరిపేటలోని గీతా మందిరంలో ప్రత్యేక అలంకరణలో రుక్మిణి సత్యభామసమేత శ్రీకృష్ణుడు



సత్తెనపల్లి పట్టణంలో ఉట్టి కొట్టే ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు



శ్రీకృష్ణ, గొల్లభామ వేషధారణలో చిన్నారులు

ముకుందా..మురారీ

నల్లనయ్య పుట్టిన రోజు సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు పల్నాడు జిల్లాలో కోలాహలంగా జరిగాయి. మదనగోపాలుడిని దర్శించుకునేందుకు ఆబాల గోపాలం ఉవ్విళ్లూరింది. కృష్ణ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండవీడు సమీపంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో కొలువై ఉన్న నవనీత బాలకృష్ణస్వామి, వెన్నముద్ద వేణుగోపాలస్వామిని భక్తులు దర్శించుకున్నారు. చిలకలూరిపేటలోని గీతా మందిరంలో రుక్మిణి సత్యభామసమేత శ్రీకృష్ణుడికి సుగంధ ద్రవ్య అభిషేకం నిర్వహించారు. ఉట్టి వేడుకలు సందడిగా జరిగాయి. ఉట్టి కొట్టడానికి యువత పోటీ పడింది.

– చిలకలూరిపేట/వినుకొండ/సత్తెనపల్లి

ఇక రోజుకు ఒక పరీక్షే

నేటి నుంచి ఎస్‌ఏ పరీక్షలు

సత్తెనపల్లి: ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ) పరీక్ష పేరు మార్పు చేశారు. ఇకపై సెల్ఫ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షగా పిలుస్తారు. పరీక్షలు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. పేరుతోపాటు పరీక్షల నిర్వహణ విధానం కూడా మార్పు చేశారు. ఇంతవరకు రోజుకు రెండు పరీక్షలు నిర్వహించేవారు. ఇక నుంచి ఒకటే పెడతారు. ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు తరగతి గది మూల్యాంకన(సీబీఏ) పద్ధతిలో ఓఎంఆర్‌లతోను, 9,10 తరగతులకు రెగ్యులర్ పద్ధతిలోనే నాన్ సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు మండలాలకు ప్యాకింగ్ ఇస్తారు. ఇందులో ఒకటి నుంచి ఐదు విద్యార్థులకు ఒకటి, ఆరు నుంచి 10 తరగతులకు మరొక బండిల్ విడివిడిగా ఇస్తారు. ఏస్థాయిలో అయినా ప్రశ్నపత్రం వాట్సాప్ లేదా ఇతర రూపాల్లో బయటికి వస్తే సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ పరీక్షలు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే జరుగుతాయి. ప్రైవేటు పాఠశాలలకు ఏ విధమైన ప్రశ్నపత్రాలు ఇవ్వమని అధికారులు ఆదేశాల్లో స్పష్టం చేశారు.



పరీక్ష పేపర్ల బండిళ్లను బాక్స్‌లో భద్రపరుస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు

ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ...

ప్రశ్నపత్రాలు లీక్ అవడానికి ఎటువంటి తావు లేకుండా ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ నియమించి ఏ రోజుకారోజు ఒక గంట ముందుగా పరీక్ష పేపర్లు ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పరీక్ష పేపర్ల బండిళ్లను బాక్స్‌లో ఏర్పాటు చేశారు. కమిటీలో సభ్యులుగా తనతో పాటు మండల విద్యాశాఖ అధికారి–2 ఏ రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, స్కూల్ అసిస్టెంట్ తాళ్లూరి శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పరీక్షలకు సంబంధించిన పేపర్స్ బాక్స్‌లో పెట్టి సీలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు తాళ్లూరి నరేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 25న చెకుముకి సంబరాలు

గుంటూరుఎడ్యుకేషన్: విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనల్ని పెంపొందించేందుకు సైన్స్‌పై ఆసక్తి, ప్రశ్నించే తత్వాన్ని ప్రేరేపించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 34 ఏళ్లుగా చెకుముకి సైన్స్ సంబరాల్ని నిర్వహిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 25న పాఠశాల స్థాయి, అక్టోబర్ ఒకటిని మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబర్ 9,10వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూపులు

ఊసెత్తని ప్రభుత్వం

- స్తంభాలు వేసి వైర్లు లాగని సిబ్బంది
- గాలి, వానలకు విరిగిపోతున్న స్తంభాలు
- మిర్చి నారుమళ్లకు నీరు కరువు

అచ్చంపేట: కృష్ణమ్మ చెంతనే ఉన్నా అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు మండలాలకు సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. ఆయా మండలాల రైతులకు బోర్లే ఆధారం. బోర్లు పనిచేయాలంటే విద్యుత్ కనెక్షన్ కావాలి. వేలాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేయించుకున్నారు. ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కేవలం స్తంభాలు వేసి చేతులు దులుపుకున్నారు. పాతిన స్తంభాలకు వైరు బిగించకపోవడంతో ఇటీవల వీచిన గాలులకు విరిగి పడిపోతున్నాయి.

100 మందికిపైగా దరఖాస్తు

అచ్చంపేట మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఈ ఏడాది మార్చిలోపు సుమారు 100 మందికి పైగా రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కొక్క రైతు ప్రభుత్వానికి రూ.6,250 డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో డబ్బులు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ప్రతి ఏడాది మార్చి 31లోపు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల భూములకు పూర్తిస్థాయిలో విద్యుత్ లైన్లు వేసి, తీగెలు, కాసారాలు వగైరా పనులు పూర్తి చేసి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాలలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో స్తంభాలు వేయలేకపోయారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పనులు ప్రారంభించినా ఈపాటికి దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ కనెక్షన్లు ఇవ్వవచ్చు. కానీ ప్రభుత్వానికి రైతుల గోడు పట్టలేదు. కంటితుడుపు చర్యగా విద్యుత్ స్తంభాలు మాత్రమే వేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. భూములలో వేల రూపాయల వ్యయంతో బోర్లు వేయించుకుని కూడా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు లేకపోవడంతో వరి, మిర్చి నారు మళ్లు పోసుకున్న రైతులు నీళ్లులేక విలవిలలాడిపోతున్నారు.



విద్యుత్ స్తంభాలు మాత్రమే వేసిన అధికారులు



విరిగిపోయిన విద్యుత్ స్తంభం

గత మార్చిలో దరఖాస్తు చేశా...



నాకు రెండెకరాల భూమి ఉంది. ప్రతి ఏటా అందులో మిర్చి పంట పండిస్తా. కానీ నీరు లేకపోవడంతో దిగుబడి రావడం లేదు. ఈ ఏడాది నా భూమిలో బోరు వేయించుకుని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం గత మార్చిలో ప్రభుత్వానికి సొమ్ము చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. స్తంభాలు వేశారు. తీగెలు లాగలేదు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు.

– నల్లమోతు సాంబయ్య, రైతు, పెదపాలెం

త్వరగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి



స్తంభాలు అయితే వేశారు. తీగెలు లాగకపోవడంతో వర్షాలకు ఆ స్తంభాలు పడిపోతున్నాయి. సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మిర్చి నారు మళ్లకు నీళ్లు కావాలి. ప్రభుత్వం స్పందించి త్వరితగతిన విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి ఆదుకోవాలి.

– పెద్దినీడి పెద రామయ్య,
రైతు, పెదపాలెం

మరో పదిరోజులలో కనెక్షన్లు ఇస్తాం

మార్చి లోపు దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ మరో 10 రోజులలో కనెక్షన్లు ఇస్తాం. తీగెలు, ఇతర సామగ్రి రావడం ఆలస్యమైంది. తాత్కాలిక ఏర్పాట్లతో రైతులకు కనెక్షన్లు ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గతంలో ఉన్న విద్యుత్ లైన్లంటిని క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపడుతున్నాం.

– మురళీకృష్ణయాదవ్,
ఎస్ఈ, ఉమ్మడి గుంటూరు జిల్లా

క్లుప్తంగా

వెన్నముద్ద వేణుగోపాలుడ్ని దర్శించుకున్న ఎస్పీ



నాదెండ్ల: కొండవీడు సమీపంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలో కొలువైయున్న శ్రీ నవనీత బాలకృష్ణస్వామి ఆలయాన్ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సందర్శించుకున్నారు. కృష్ణాష్టమి సందర్భంగా వెన్నముద్ద వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో చెన్నుపల్లి శివయ్య, ప్రధాన అర్చకులు పర్చూరి సత్యనారాయణచార్యులు, ఆలయ ధర్మకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బనాయుడు, యడ్లపాడు ఎస్సై బి.బాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

జిల్లా బాలబాలికల ఆట్యా-పాట్యా జట్టు ఎంపిక



నకరికల్లు: రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటి పల్నాడుకు మంచిపేరు తీసుకురావాలని ఫిజికల్ డైరెక్టర్ చింతా పుల్లయ్య క్రీడాకారులను కోరారు. పల్నాడు జిల్లాస్థాయి ఆట్యా-పాట్యా బాలబాలికల జట్టుకు సెలక్షన్స్‌ను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని పలుపాఠశాలల నుంచి సుమారు 80మందికి పైగా బాలబాలికలు సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో నైపుణ్యాలను పరీక్షించి జిల్లాస్థాయి జట్టును ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 14, 15వ తేదీలలో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్‌లు జి.ఝాన్సీరాణి, తిరుమల బాయి, క్రీడా ఉపాధ్యాయుడు జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను కఠినతరం చేయాలి



మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. మహిళలపై దాడులు చేయాలంటే భయపడే పరిస్థితులు కల్పించాలి. కోల్‌కతాలో మహిళ డాక్టర్ హత్యోదంతం సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ప్రాణాలు కాపాడే డాక్టర్‌పై ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడటం అత్యంత శోచనీయం. ఇటువంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటుగా సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉంది.

–డాక్టర్ శ్రీరామనేని కృష్ణప్రసాద్, కృష్ణా హాస్పిటల్, నారాయణపురం



మహిళా డాక్టర్లకు ప్రత్యేక చట్టాలు ఉండాలి



కోల్‌కతా సంఘటన చాలా బాధాకరం. ఒక మహిళా డాక్టర్‌గా ఆమెకు నా నివాళి. ఇటువంటి సంఘటన మరోసారి దేశంలో జరగకుండా మహిళా డాక్టర్లకు ప్రత్యేకమైన చట్టం తీసుకొస్తే బాగుంటుంది. అది ఎలాగుండాలంటే వారిని చెడు దృష్టితో చూసేందుకే భయపడే విధంగా ఉండాలి. వారికి రక్షణ కల్పించకపోతే రోగులకు ఏవిధంగా వైద్యసేవలు అందజేస్తారు. ప్రభుత్వాలు ఆలోచించాలి. ఈ సంఘటనలో నేరస్తులను వెంటనే గుర్తించి అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలి.

–డాక్టర్ పేరం రాజ్యలక్ష్మి, చిన్న పిల్లల వైద్యులు, నరసరావుపేట

రైతులపై ఎరువుల భారం రూ.2.5కోట్లు

- నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో గూడ్స్‌షెడ్డు తొలగింపు
- అందుబాటులోకి రాని సాతులూరులోని గూడ్స్‌షెడ్డు
- గుంటూరులోని రెడ్డిపాలెం నుంచి ఎరువులు దిగుమతి
- బస్తాకు రూ.20 వరకు అదనపు భారం



రైల్వేస్టేషన్‌లో గూడ్స్ షెడ్ తొలగించి నిర్మిస్తున్న ప్లాట్‌ఫామ్

నరసరావుపేట: పల్నాడు రైతులపై మరో ఆర్థిక భారం పడింది. వారు కొనుగోలు చేసే ప్రతి ఎరువు బస్తాపై సుమారు రూ.20 వరకు అదనపు భారం మోపుతున్నారు. ఫలితంగా రూ.2.5కోట్లకు పైగా భారం పడుతోంది. నరసరావుపేట రైల్వేస్టేషన్‌లో 50ఏళ్లగా ఉన్న గూడ్స్‌షెడ్డును తొలగించటం, గుంటూరు సమీపంలోని రెడ్డిపాలెం నుంచి ఎరువులు దిగుమతి కావటమే దీనికి కారణంగా చెబుతున్నారు. వివరాలను పరిశీలిస్తే.. ఏడెనిమిదేళ్లగా 250 కిలోమీటర్ల గుంటూరు–గుంతకల్లు మార్గంలో రెండో రైల్వేలైను నిర్మాణ పనులు సుమారు రూ.400కోట్లకు పైగా నిధులతో జరుగుతున్నాయి. ఈ కారణంగా రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ఉన్న గూడ్స్‌షెడ్డును తొలగించి దాని స్థానంలో రెండో లైను వేసి దానికి అనుబంధంగా ప్లాట్‌ఫామ్ నిర్మాణం చేపట్టారు. ఈ గూడ్స్‌షెడ్డును నాదెండ్ల మండలం సాతులూరు సమీపంలోని రైల్వేస్టేషన్‌లో నిర్మాణం చేపట్టారు. షెడ్డు నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి. ఈ గూడ్స్‌షెడ్డు ఇక్కడ ఉండగా జిల్లాలోని రైతులకు కావాల్సిన ఎరువులు గూడ్స్ రైలు ద్వారా దిగుమతి అయ్యేవి. వీటిని లారీల ద్వారా పట్టణ శివారు ప్రదేశాల్లో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన గోడౌన్లలో భద్రపర్చేవారు. అవి వ్యాపారుల ద్వారా రైతులకు చేరేవి. ఇప్పుడు షెడ్డు సౌకర్యం లేకపోవటంతో ఇక్కడ అసలు గూడ్స్ రైళ్ల ఆగటంలేదు. వాటి నుంచి ఏవిధమైన వస్తువులు దిగుమతి కావట్లేదు. ఒక్కొక్క గూడ్స్‌రేక్‌కు 2,500 టన్నుల ఎరువులు దిగుమతి అవుతాయి. 2022లో సుమారుగా 60రేక్‌ల ఎరువులు నరసరావుపేటకు దిగుమతి అయ్యాయి. గూడ్స్‌షెడ్ లేకపోవటంతో పీడీఎస్ బియ్యం దిగుమతికి కూడా కష్టాలు ఏర్పడ్డాయి. గతంలో గూడ్స్‌షెడ్డు ఉండగా ఇక్కడి నుంచి వైజాగ్‌కు 30రేక్‌ల మొక్కజొన్న ఎగుమతి జరిగింది.

జిల్లాలో సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు

జిల్లాలో కుడికాలువ కింద సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు కాగా, ఖరీఫ్‌కు 99,370 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఆగస్టు వరకు 53,392మెట్రిక్ టన్నులు కావాల్సివుంది.

గుంటూరు నుంచి ఎరువుల దిగుమతి

ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్‌లో జిల్లా రైతాంగానికి సుమారుగా రూ.2లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ఎరువులు అవసరం ఉంటుందని అధికారుల అంచనా. ఇప్పుడు సుమారు 35 కిలోమీటర్ల దూరంలోని గుంటూరు రెడ్డిపాలెం సమీపంలోని షెడ్డులకు దిగుమతి అయిన ఎరువులు వ్యాపారులకు చేరుతున్నాయి.

నరసరావుపేట స్టేషన్‌కు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో మునుమాక స్టేషన్‌లో ఓ గోడౌన్ ఉన్నా దాని సామర్థ్యం కేవలం 1100 (హాఫ్‌రేక్) టన్నులే. దీంతో ఎరువులలో సింహభాగం గుంటూరు నుంచే దిగుమతి కావాల్సిన పరిస్థితి నెలకొంది. రబీ సీజన్‌లో మరికొన్ని ఎరువులు రైతాంగానికి అవసరం ఉంది. సాధ్యమైనంత త్వరగా సాతులూరులో చేపట్టిన గూడ్స్‌షెడ్డు పూర్తిచేసి ఆ సౌకర్యాన్ని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. దీని వలన రైతులపై కొంత భారం తగ్గనుంది.

కృష్ణా, ప్రకాశం మ్యాచ్ డ్రా

- బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించిన కృష్ణా జట్టు
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కృష్ణాకు ఆరు పాయింట్లు



ఆర్యన్‌సాయి, 149పరుగులు, కృష్ణా జట్టు



జి.ఆదర్శ్, 5 వికెట్లు, కృష్ణా జట్టు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్న సెంటర్ జోన్ అంతర్ జిల్లాల అండర్–23 క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 229 పరుగులకు ఆలౌట్ కాగా, ప్రకాశం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 210 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన కృష్ణా జట్టు నిన్నటి ఓవర్‌నైట్ స్కోర్ ఆరు వికెట్లు నష్టానికి 159 పరుగులతో సోమవారం బ్యాటింగ్ కొనసాగించి 284 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్యన్‌సాయి 239 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 149 పరుగులు చేయగా, టి.సాయిప్రకాష్ 44 పరుగులు సాధించాడు. ప్రకాశం బౌలర్లు పి.నవీన్ 3, పి.దుర్గాబాలాజీ 4వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు ఆట ముగిసే సమయానికి 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. జట్టులోని జి.రోహిత్ 84 పరుగులు చేయగా, కృష్ణా బౌలర్ ఆదర్శ్ ఐదు వికెట్లు సాధించాడు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యతతో కృష్ణాజిల్లా జట్టుకు ఆరు పాయింట్లు, ప్రకాశం జట్టుకు ఒక పాయింట్ లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వాగ్దేవి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వాగ్దేవి కళాశాల డైరెక్టర్లు

నరసరావుపేట ఈస్ట్: వాగ్దేవి డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాలల ప్రిన్సిపల్స్ కపలవాయి రాజేంద్రప్రసాద్, ఓగూరి నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన ఉమ్మడి గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో డిగ్రీ కళాశాల విద్యార్థులు కె.ప్రవీణ్‌కుమార్ 400 మీటర్లు పరుగులో ప్రథమ, 200 మీటర్లలో ద్వితీయ, జె.యశ్వంత్‌కుమార్ 400 మీటర్లలో ద్వితీయ, షేక్.అల్మాస్ తృతీయ, డి.వీరాంజి డిస్క్‌త్రో ప్రథమ, షాట్‌పుట్‌లో ద్వితీయ, కె.ఏసుబాబు 1500 మీటర్లలో ప్రథమ, బాలికల విభాగంలో కె.ఆదిలక్ష్మి 100మీటర్లలో ద్వితీయ, డిస్క్‌త్రోలో ద్వితీయ, వై.చిలకమ్మ షాట్‌పుట్‌లో ద్వితీయ, 100మీటర్లలో తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. అండర్–18 బాలికల విభాగంలో జూనియర్ కళాశాలకు చెందిన పి.తిరుపతమ్మ 100 మీ, 1500మీటర్లలో ప్రథమ, కె.శ్రీనిధి 1000మీ ప్రథమ, 100మీ ద్వితీయ, ఏ.బాలప్రసన్న లాంగ్‌జంప్ ద్వితీయ, బాలుర విభాగంలో శంకర్ 5కె వాక్‌లో ద్వితీయ, జి.సాయికాశి 1000మీ ద్వితీయ, బి.మారుతి లాంగ్‌జంప్‌లో ద్వితీయ, జి.వి.వి.నాని షాట్‌పుట్‌లో ద్వితీయ, అండర్–20 బాలుర విభాగంలో పి.భానుప్రకాష్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ, కె.ప్రతాప్ ద్వితీయ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. సెప్టెంబరు 14, 15 తేదిలల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు రాయల శ్రీనివాసరావు, పాశం కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, కాట్ల రామకోటేశ్వరరావు, పీడీ రాయల ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగస్వాములు కావాలి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌పాల్



వినుకొండ వాసులకు కండువా కప్పిన జాన్‌పాల్

నరసరావుపేట: క్రిమిలేయర్, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటాల్లో అందరూ భాగస్వాములు కావాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ పిలుపుఇచ్చారు. ఈ ఉద్యమంలో భాగస్వామ్యమయ్యేందుకు వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వచ్చిన ఈపూరు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన రఘు, సలోమి, సామేలుకు సోమవారం స్థానిక కార్యాలయంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో దళిత, గిరిజనులకు సంబంధించిన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు నిరసనగా రాష్ట్రంలో పల్లెపల్లెను చైతన్యం చేస్తూ పోరాటంలో మహిళలను పెద్దఎత్తున తరలించేందుకు గ్రామీణప్రాంత ప్రజలు తరలిరావాలని అన్నారు. రానున్న ఉద్యమాలకు అన్నీ వర్గాల ప్రజల్ని ఒక వేదిక మీదకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా, మండల, గ్రామ ప్రాంతాల్లో బలంగా పనిచేసే సైన్యాన్ని తయారు చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి ఆర్.చిన్న, సీనియర్ నాయకులు కె. సుధా పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న పాండురంగ వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం గుంటూరు జోన్ కన్వీనర్ కేసన రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ జీవో 117 రద్దు చేయాలని కోరారు. 3,4,5 తరగతుల్ని ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కు తీసుకుని ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించడం ద్వారా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రంలో ఒక్క తెలుగు మీడియం తప్పా ఒరియా, కన్నడ, తమిళ్, ఉర్దూ తదితర మాధ్యమాల్లో చదువుకోవడం తెలుగు విద్యార్థులు చేసుకున్న దురదృష్టమన్నారు. తక్షణమే తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఉపాధ్యాయులు వృత్తికి పునరంకితం కావడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్ని కాపాడుకోవాలని సూచించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ విద్యాశాఖాధికారుల నిర్ణయాలతో మిగులు ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ గందరగోళానికి దారితీసిందని విమర్శించారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలానీ మాట్లాడుతూ డీఏ పెండింగ్ బకాయిలు విడుదలతో పాటు ప్లస్ 2 పాఠశాలల్లో ఖాళీల్ని వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఫిరంగిపురం, తాడికొండ మండలాల నుంచి ఎస్టీయూ శాఖ కార్యకర్తలు, నాయకులు టి.భాస్కర్, చక్కా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కబీర్, జహంగీర్, జఫరుల్లా, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు ఏపీటీఎఫ్‌లో చేరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, పి.పార్వతి, జిల్లా కార్యదర్శి లు ఎస్.ఎస్.ఎన్ మూర్తి, జి.దాస్, రాష్ట్ర కౌన్సిలర్ చెత్తిపోగు లక్ష్మణ్ కుమార్, జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.

హరేకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



మందిరంలో ప్రత్యేక పూజలు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఇస్కాన్ టెంపుల్ (హరేకృష్ణ మందిరం)లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు చక్రధారి ప్రభు మాట్లాడుతూ ఉదయం 4.30 గంటలకు శ్రీశ్రీ రాధాశ్యామ్ సుందర్‌కు ధూప, దీప హారతులు, కీర్తనలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం స్వామికి పంచామృతాలతో కలశ అభిషేకం నిర్వహించామని పేర్కొన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారని, సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడు నడయాడిన బృందావన నమూనాను తయారు చేసి అక్కడ నిర్వహించిన ఊంజల్ సేవ అందరినీ ఆకట్టుకుందని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు స్వామికి మహా శంఖాభిషేకం, మహా హారతి, ఘన కీర్తనలు, 108 రకాల పిండివంటలతో భోగా అర్పించడంతో వేడుకలు ముగుస్తాయని చక్రధారి ప్రభు తెలిపారు.

ఎల్‌ఐసీ జోనల్ గేమ్స్ చీఫ్ రిఫరీగా అబ్దుల్ జలీల్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడపలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న ఎల్‌ఐసీ ఆఫ్ ఇండియా జోనల్ క్రీడా పోటీలకు చీఫ్ రిఫరీగా గుంటూరుకు చెందిన ప్రముఖ క్యారమ్స్ క్రీడాకారుడు షేక్ అబ్దుల్ జలీల్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి ఆయనకు ఆదేశాలందాయి. గతంలో జలీల్ భారత క్యారమ్స్ జట్టు సభ్యునిగానూ, ఇండియా జట్టు కోచ్‌గానూ పని చేశారు. 2013లో కోల్‌కతాలో జరిగిన ఏడు దేశాల సార్క్ క్యారమ్స్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు బంగారు పతకం గెలుపొందింది. ఈ జట్టుకు కోచ్‌గా జలీల్ వ్యవహరించారు. ప్రస్తుతం జలీల్ ఆంధ్ర రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఎల్‌ఐసీ సంస్థతో కూడా ఆయనకు అనుబంధముంది.

కొత్తపల్లిలో ఇసుక అక్రమ తవ్వకాలు

- అడ్డుకున్న స్థానికులు
- రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్ స్వాధీనం
- స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రెండు జేసీబీలు, ట్రాక్టర్

అచ్చంపేట: మండలంలోని కొత్తపల్లికి సమీపంలోని కృష్ణానదిలో రెండు జేసీబీలతో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న వారిని స్థానికులు అడ్డుకున్న ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల సమాచారం వేరకు... అర్ధరాత్రి సమయంలో ఒక వ్యక్తి రెండు జేసీబీలతో 12 అడుగుల లోతులో ఇసుక తవ్వి, లారీలు, ట్రాక్టర్లు నింపి రవాణాకు సిద్ధం చేయగా గ్రామస్తులు అడ్డుకుని అచ్చంపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సిబ్బందితో దాడి చేసి రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో మరో 12 చక్రాల లారీ, రవాణా చేసే వ్యక్తి కూడా ఉన్నట్లు సమాచారం. దీనిపై అచ్చంపేట సీఐ కె.వెంకట్‌ప్రసాద్‌ను వివరణ కోరగా విశ్వసనీయ సమాచారం మేరకు ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం వేరకు దాడులు నిర్వహించి రెండు జేసీబీలు, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మద్దిరాల గ్రామానికి చెందిన షేక్ ఆసిఫా (15) ఆదివారం రాత్రి తండ్రి మాబు సుభానితో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తూ జారి రోడ్డుపై పడిపోయింది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ బాలికపైగా వెళ్లడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. తండ్రి మాబు సుభాని ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి మృతి

తెనాలి రూరల్: రైలులో ప్రయాణికుడు మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. ఒడిశాలోని గంజాం బోరాడకు చెందిన బలరాం ప్రధాన్(66) కొట్టాయంలో ఇటుక బట్టీలలో పని చేసేందుకు వెళ్లాడు. ఆరోగ్యం బాగుండకపోవడంతో అక్కడ వైద్యులకు చూపించుకుని స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా తెనాలి సమీపంలో రైలులో మృతి చెందాడు. మృతుని బంధువులు రైల్వే అధికారులకు చెప్పడంతో తెనాలి జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ వెంకటాద్రి సోమవారం రాత్రి తెలిపారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకులకు అవార్డులు



అవార్డులు పొందిన అధ్యాపకులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: తమ కళాశాల అధ్యాపకులకు విప్రో ధ్రువీకృత అవార్డు రావడం సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఐటీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వి. పావనికి ఉపాధ్యాయుల విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమ్మిట్– 2024లో డిజిటల్ ఇన్నోవేటర్స్ ఆఫ్ టుమారో అవార్డు లభించిందన్నారు. డాక్టర్ వి పావని, జి రోహిణి ఫణీంద్రకుమారిలను విప్రో సంస్థ తమ ధ్రువీకృత అధ్యాపకులుగా గుర్తించి అవార్డును అందజేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తమ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరెన్నో సాంకేతిక ఆవిష్కరణలు చేసే దిశగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి గుర్తింపుతో పాటు డిజిటల్ ఇన్నోవేషన్ రంగంలో అగ్రస్థాయిలో ఉన్న కళాశాలగా విజ్ఞాన్ నిరుల గుర్తింపబడటం గొప్ప విషయమని కళాశాల ఐటీ విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎస్.ఎస్. రామకృష్ణ, కళాశాల ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ సమన్వయకర్త డాక్టర్ కె.సత్యసందీప్ తెలిపారు. చివరగా అవార్డులు పొందిన అధ్యాపకులను పలువురు అభినందించారు.

అవధానంలో అందెవేసిన చేయి నారాయణం

ముగిసిన శతావధాన కార్యక్రమం



అవధాన దంపతులను సత్కరిస్తున్న పుట్టంరాజు దంపతులు

అద్దంకి: అవధానానికి చిరునామా నారాయణం బాలసుబ్రహ్మణ్యమని రిటైర్డ్ ఆర్జేడీ యు.దేవపాలన అన్నారు. పట్టణంలోని చిన్న శాంతయ్య పిచ్చిమ్మ గార్ల సేవా సదన్‌లో సాహితీ మిత్రమండలి, పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవధాన పురస్కార సభకు డాక్టర్ యు.దేవపాలన అధ్యక్షత వహించారు. శనివారం ప్రారంభమైన శతావధాన కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా దేవపాలన మాట్లాడుతూ అవధాన క్రీడలో అందెవేసిన చేయి నారాయణం అన్నారు. అవధానం ఒక పద్యక్రీడ అని, అందులో ఆరితేరిన అవధాని నారాయణం అని పేర్కొన్నారు. శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ ఆశువుగా పద్యాలు చెప్పడం, సాహితీ పటిమకు అత్యున్నతమైన పరీక్ష అవధానమని చెప్పారు. అంశాలకు ఆశువుగా, చమత్కార భరితంగా పూరణలు చేయడంలోనూ, సరస సంభాషణలు, చతురోక్తులతో అవధాన ప్రక్రియను నడపడంలోనూ నారాయణం సిద్ధహస్తుడన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అద్దంకి వాసుల అదృష్టంగా భావించవచ్చునని సంచాలకులు పోలూరి వెంకటశివరామ ప్రసాద్ అన్నారు. డాక్టర్ తాళ్లూరి ఆంజనేయులు మాట్లాడారు. చివరలో నారాయణం దంపతులను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజలు జ్ఞాపికనిచ్చి దుశ్శాలువాతో సత్కరించి రూ. 10 వేలు అందించారు. సన్మాన పత్రాన్ని ప్రముఖ నటుడు వారణాసి రఘురామశర్మ, చుండూరి మురళీ సుధాకరరావు అందించారు. కార్యక్రమంలో గాడేపల్లి దివాకరదత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, డీవీఎం సత్యనారాయణ, ఇలపావులూరి శేష శ్రీధరశర్మ, మానేపల్లి నాగకుమారశర్మ, ఎం.కిషోర, ఐలవరం వీరాంజనేయులు, దుర్గా కొండి న్యజాయి, చిమకుల వెంకట చలపతి, మద్దాలి శ్రీనివాస్, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.